## క్లుప్తంగా

### మాజీ సీఎం జగన్‌ను కలసిన ఎంపీపీ



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో ఎంపీపీ కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జగన్‌ను కలసి మండలంలోని పరిస్థితులను వివరించారు.

### సత్యనారాయణకు ముద్రగడ పరామర్శ



కాకినాడ ట్రస్టు ఆసుపత్రిలో సత్యనారాయణను పరామర్శిస్తున్న ముద్రగడ గిరిబాబు

రౌతులపూడి: అనారోగ్యంతో బాధపడుతూ కాకినాడ ట్రస్టు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ములగపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల వీరవెంకట సత్యనారాయణను ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు బుధవారం పరామర్శించారు. కాకినాడ ట్రస్టు ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. సత్యనారాయణ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

### శ్రీసంస్థానం భూములకు కౌలు వేలం



తొండంగి రామలింగేశ్వరాలయంలో కౌలువేలం నిర్వహిస్తున్న అధికారులు

తొండంగి: పిఠాపురం శ్రీసంస్థానానికి చెందిన తొండంగిలోని భూములకు బుధవారం స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో కౌలు వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా రూ.5.34 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో నున్న శ్రీరాములు తెలిపారు. రెండు రోజుల నుంచి వేలం నిర్వహిస్తున్నారు. 30 బిట్లుగా 53.39 ఎకరాలకు కౌలు వేలం నిర్వహించగా రూ.5.34 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. గతంలో ఈ భూములకు రూ.5.19 లక్షలు వచ్చిందని, ఈసారి రూ.14,800 పెరిగిందని ఈవో వివరించారు. ఈ నెల 19 వరకూ కౌలు వేలం ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కౌలు వేలం పర్యవేక్షకులు వీరభద్రరావు, శృంగావల్లభస్వామి దేవస్థానం ఈవో వడ్డి శ్రీనివాసరావు, ఫణికుమార్ దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### కూలింగ్ వాటర్ ఫిల్టర్ బహూకరణ



కాట్రావులపల్లిలో కూలింగ్ వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి గణేష్‌బాబు

జగ్గంపేట: మండంలోని కాట్రావులపల్లిలో అఖిల భారత అయ్యప్ప సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రానికి కట్టమూరు గ్రామానికి చెందిన నెక్కంటి సీఫుడ్స్ సంస్థ రూ.50 వేల విలువ చేసే కూలింగ్ వాటర్ ఫిల్టర్‌ను బహూకరించింది. ఈ వాటర్ ఫిల్టర్‌ను పంచాయతీ కార్యదర్శి ఏలూరి గణేష్‌బాబు బుధవారం ప్రారంభించారు. వాటర్ ఫిల్టర్ బహూకరించిన నెక్కంటి సీఫుడ్స్ మేనేజర్ ఉండవల్లి గోపిచంద్‌కు గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నెక్కంటి సీఫుడ్స్ ప్రతినిధులు నెక్కంటి రమేష్, చంద్రమౌళి పాపయ్య శాస్త్రి, స్థానిక నేతలు ముసిరెడ్డి నాగేశ్వరరావు, సుంకర సీతారామయ్య, కంటే రామారావు, యడ్లపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### సత్యదేవుని దర్శించిన ఎస్పీ

అన్నవరం: రత్నగిరివాసుడు వీరవేంకట సత్యనారాయణ స్వామివారిని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం దర్శించారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు.

# కూరగాయల సాగుకు సన్నద్ధం!

- ఆసక్తి చూపుతున్న మెట్ట రైతులు
- 250 ఎకరాల్లో సాగు
- వాతావరణం అనుకూలిస్తే తక్కువ పెట్టుబడితో లాభాలు

రౌతులపూడి: మెట్టప్రాంతమైన ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రైతులు కూరగాయల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో రైతులు కూరగాయల సాగు చేస్తున్నారు. మరికొంత మంది భూమిని సదును చేసి కంచెలు, పందెళ్లు వేసి సాగుకు సిద్ధమవుతున్నారు.

**మండలంలో సాగు వివరాలు**

రౌతులపూడి మండలంలో సుమారు 250 ఎకరాల్లో కూరగాయల సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంతం కావడంతో ఇక్కడ రైతులు వర్షాధారంపై ఆధారపడాల్సి వస్తోంది. రైతులు బీర, చిక్కుడు, ఆనబ, కాకర, ఆకాకర వంటి తీగజాతుల కూరగాయల సాగు ఎక్కువగా చేపడుతున్నారు. బెండ, వంగ, టమాటా, పచ్చిమిర్చి, గోరు చిక్కుడు, మునగ వంటి పంటలను సాగు చేస్తున్నారు. పత్తి, పొగాకు వంటి వాణిజ్య పంటల్లో అంతర పంటలుగా బీర, చిక్కుడు, కాకర వంటి తీగజాతులను సాగు చేస్తున్నారు. కూరగాయల సాగుకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకూ ఖర్చవుతుంది. వాతావరణం అనుకూలించి దిగుబడి వస్తే రూ.లక్ష వరకూ ఆదాయం వచ్చే అవకాశం ఉంది.



గుమ్మరేగులలో సోయాచిక్కుడు సాగు

**రైతులకు ప్రోత్సాహకాలు**

కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పలు ప్రోత్సాహకాలు అందిస్తోంది. బిందు, తుంపర సేద్యం ద్వారా కూరగాయల సాగు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీని కోసం సూక్ష్మ నీటివనరుల పథకం ద్వారా 90 శాతం సబ్సిడీపై పరికరాలు, బిందు సేద్యానికి అవసరమైన స్ప్రింకర్లకు 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తోంది. అంతేకాకుండా కూరగాయల ఉత్పత్తిని పెంచేందుకు, నష్టాలను నివారించేందుకు అవసరమైన శాశ్వత పందెళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం హెక్టారుకు రూ.లక్ష వరకు ఆర్థిక సహకారం చేస్తోంది. బీర, చిక్కుడు వంటి తీగ జాతి కూరగాయల నాణ్యమైన టమాటా ఉత్పత్తి కోసం ట్రెల్లీస్ పద్ధతిని అవలంబించి సాగు చేస్తే గరిష్ఠంగా హెక్టారుకు రూ.24000 వరకూ సబ్సిడీ ఇస్తున్నట్టు ఉద్యాన శాఖ అధికారి దివ్యశ్రీ తెలిపారు.



బీర, చిక్కుడు పాదులకు వేసిన పందిర్లు

**50 శాతం రాయితీపై విత్తనాలు**

కూరగాయల సాగు చేసే రైతులకు ప్రభుత్వం 50 శాతం రాయితీతో విత్తనాలు అందిసోతంది. పల్లెల్లో కంచెలు, పందెళ్లు వేసి హైబ్రీడ్ టమాటా సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ.24 వేల వరకూ ఆర్థిక సహాయం అందిస్తారు. రైతులు రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి.

– దివ్యశ్రీ, మండల ఉద్యానవనశాఖ అధికారి, రౌతులపూడి

**రూ.70 వేల పెట్టుబడి పెట్టాను**

నాకున్న కొద్దిపాటి భూమితో పాటు 1.30 ఎకరాల కౌలుకు తీసుకుని సోయాచిక్కుడు సాగు చేపట్టాను. కంచెలు, క్రిమిసంహారక మందులు కొనుగోలు కోసం రూ.70 వేల వరకూ పెట్టుబడి పెట్టాను. వాతావరణం అనుకూలించి ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తే సుమారుగా రెండు, మూడు లక్షల వరకూ ఆదాయం తీయవచ్చు. కౌలు సొమ్ములు పోను కొద్దిపాటి లాభాలు వస్తాయని ఆశిస్తున్నాను.

– సామన భూషణం, గుమ్మరేగుల, కౌలు రైతు

### లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



ప్రత్తిపాడు లయన్ క్లబ్ అధ్యక్షుడు రెడ్డి నాయుడును సత్కరిస్తున్న గిరిబాబు

కిర్లంపూడి: పేదలకు స్థానిక లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులుగా లయన్ రెడ్డి నాయుడు, కార్యదర్శిగా లయన్ గోళ్ల నాగేశ్వరరావు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. వీరు బుధవారం కిర్లంపూడిలోని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యులు(పీఏసీ) ముద్రగడ పద్మనాభం నివాసానికి వెళ్లి ఆయన, గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని పూలమాల, శాలువా, పుష్పగుచ్ఛంతో గిరిబాబు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు మండల కన్వీనర్ రామిశెట్టి నాని, ముద్రగడ వీరేంద్ర, గుమ్ములూరి పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

- రైతులకు ఖరీఫ్ సాగుపై అవగాహన
- గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాలు

కోటనందూరు: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు పద్మశ్రీ సూచించారు. మండలంలోని జగన్నాథపురంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ పద్మశ్రీ మాట్లాడుతూ మెరక భూముల్లో రాగులు, మినుములు, కందులు సాగు చేయాలన్నారు. తొలకరిలో వరి పొలాల గట్లపై సాగు చేసేందుకు కందుల విత్తనాలు రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. వరి సాగు చేసే ప్రతి రైతు తప్పకుండా బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు జగ్గప్పారావు, సురేష్, వీపీఏ బ్రహ్మనాయుడు, రైతులు పాల్గొన్నారు.

జగ్గంపేట: మండంలోని రాజపూడి, జె.కొత్తూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ ఏడీ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ వరి నారుమళ్లు నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నట్టు గుర్తించామన్నారు. నారుమళ్ల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ పద్మశ్రీ

**అపరాల సాగుపై అవగాహన**

గండేపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అపరాల సాగు మేలు అని డీఆర్సీ ఏడీఏ డి. మాలకొండయ్య అన్నారు. మండలంలోని సింగరంపాలెంలో ఏఓ ఆర్.శ్రీరామ్ అధ్యక్షతన బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అపరాల సాగుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న కందులు, మినుము విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ పి.చంద్రమౌళి, వీహెచ్ఏ జి.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



రాజపూడిలో వరి నారుమళ్లను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

**పంటల బీమా చేయించాలి**

తొండంగి: మండలంలోని కౌలు రైతులు ఎల్ఈసీ కార్డులు పొందిన తరువాత పంటల బీమా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి ఎంఎంవీఎస్ పద్మశ్రీ సూచించారు. మండలంలోని శృంగవృక్షంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ సాగు చేసే రైతులు ఎకరాకు రూ.770 చొప్పున చెల్లించి పంటల బీమా చేయించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల్లో పంటలు నష్టపోతే పరిహారం అందుతుందన్నారు.

# మరిడమ్మకు సారె సమర్పణ

ఏలేశ్వరం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఏలేశ్వరం గ్రామదేవత మరిడమ్మతల్లికి బుధవారం సారె సమర్పించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక లారీ యూనియన్ కార్యాలయం వద్ద వేంచేసిన మరిడమ్మతల్లికి పలు రకాల పిండివంటలతో సారె సమర్పించారు. విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళాసంఘాల ఆధ్వర్యంలో విష్ణు, పలు పారాయణాలు, భగవద్గీత పఠనం చేసి భక్తి పాటలు ఆలపించారు కార్యక్రమంలో పరిషత్ మండల కార్యదర్శి కటకం కిరిటీ, సభ్యులు గిరిజ, ఇందిరా, మల్లేశ్వరి, సూర్యకుమారి, స్వరాజ్యం, మంగామణి తదితరులు పాల్గొన్నారు.

**తలుపులమ్మకు చీర, సారె సమర్పిస్తే సౌభాగ్యాలు**

తుని రూరల్: ఆషాఢ మాసంలో శుక్రవారం తలుపులమ్మ అమ్మవారికి చీర, సారె సమర్పించుకుంటే శుభసౌక్యాలు కలుగుతాయని లోవ దేవస్థానం ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆషాఢ మాసంలో ప్రతి శుక్రవారం అమ్మవారికి చీర, సారె ఇచ్చే సాంప్రదాయాన్ని నూతనంగా ప్రవేశపెట్టామన్నారు. గడిచిన మూడు వారాలు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చి అమ్మవారికి చీర, సారెలను సమర్పించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులకు దేవస్థానం అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటం, పసుపు, కుంకుమలతో పాటు ప్రసాదాలను అందిస్తున్నట్టు తెలిపారు. భక్తులు ఆఖరి శుక్రవారాన్ని చీరసారె సమర్పణకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు ఆయన వివరించారు.



ఏలేశ్వరంలో పారాయణం చేస్తున్న మహిళలు

# పుష్కర ఆయకట్టుకు నీరు విడుదల



యర్రంపాలెంలో పుష్కర లిఫ్ట్ నుంచి నీటిని విడుదల చేస్తున్న ప్రాజెక్ట్ చైర్మన్, వైస్ ఎంపీపీలు

గండేపల్లి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రతిఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్టు పుష్కర ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, వైస్ ఎంపీపీ కుంచే రాజా అన్నారు. మండలంలోని యర్రంపాలెంలో పుష్కర లిఫ్ట్ నుంచి ఆయకట్టుకు బుధవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కాట్రావులపల్లి, కోటపాడు, ఆనూరు, మల్లిపూడి, యర్రంపాలెం, సూరంపాలెం, నాయకంపల్లి తదితర గ్రామాల్లో 11,600 ఎకరాలకు యర్రపాలెం పుష్కర లిఫ్ట్ ద్వారా నీరు అందుతుందన్నారు. తాళ్లూరు లిఫ్ట్‌లో సిమెంట్ పైపుల స్థానంలో ఐరన్ పైపులు వేసేందుకు, మరమ్మతుల నిమిత్తం రూ.55 కోట్లతో టెండర్లు పిలిచినట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఈ మోహన్‌రావు, జేఈలు హేమ సుందర్, సుధా, నాయకంపల్లి సొసైటీ అధ్యక్షుడు పాలకుర్తి ఆదినారాయణ, చందు, గళ్లా కృష్ణ, అల్లం గోవిందు, నీటి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### సచివాలయ ఉద్యోగులకు ఘన వీడ్కోలు



పెద్దిపాలెంలో సచివాలయ సిబ్బందిని సత్కరిస్తున్న గ్రామస్తులు

ప్రత్తిపాడు: మండలంలోని పెద్దిపాలెం గ్రామ సచివాలయ ఉద్యోగులకు బుధవారం ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. సచివాలయానికి చెందిన ఉద్యోగులు జాన్, రవి, గణేష్, ఇజ్రాయేల్, మూర్తి ఇటీవల బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పెద్దిపాలెం గ్రామ సచివాలయంలో బుధవారం సిబ్బందిని గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రీసు సత్యనారాయణ, లొండా వెంకటేష్, లొండా బాబు, దేవ లక్ష్మణ్, కోరుకొండ శ్రీను, పంచదార్ల నాగు, పంచాయతీ కార్యదర్శి పి.నాగమణి, వీఆర్వో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### పంట కాలువలో పూడిక తీత



'నీరుపారేదెలా ?' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

కిర్లంపూడి: ప్రస్తుతం ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. కాగా కిర్లంపూడిలోని సింహాద్రి పంట కాలువలో చెత్త, తూటికాడ, గడ్డి, పిచ్చిమొక్కలు పేరుకుపోయి సాగునీరు పారేందుకు ఆటంకంగా మారాయి. దీనిపై ఇటీవల 'నీరు పారేదెలా ?'శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై నీటి సంఘం ప్రెసిడెంట్ తూము శ్రీరామూర్తి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఇరిగేషన్ సిబ్బంది సాగునీరు పారేందుకు అడ్డు లేకుండా బుధవారం పొక్లెయిన్ సహాయంతో కాలువలోని చెత్త, వ్యర్థాలు తూటికాడ, గడ్డి, పిచ్చి మొక్కలు తొలగించారు.



కిర్లంపూడి సింహాద్రి కాలువలో పూడికతీత పనులు

సాక్షి ఇంపాక్ట్

# 'తోలేటి'కి తోట అభినందనలు



తోలేటి రాంప్రసాద్‌ను సత్కరిస్తున్న తోట నరసింహం

గోకవరం: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన తోలేటి రాంప్రసాద్‌ను ఆ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం అభినందించారు. గండేపల్లి మండలంలో బుధవారం ఆయన తోట నరసింహం, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తోట శ్రీరాంజీలను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాంప్రసాద్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ పంచాయతీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు నరాలశెట్టి నర్సయ్య, అంబటి అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోపాలపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మతులు, చెట్లు కొమ్మల తొలగింపు పనులు చేపడతామన్నారు. ఎ.కొత్తపల్లి, తమ్మయ్యపేట, బెండపూడి, అన్నవరం తదితర గ్రామాలకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

**తుని మండలంలో...**

తుని రూరల్: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఏపీఎస్‌డీఎస్ ప్రభాకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. టి.తిమ్మాపురం, వెంకటాపురం, గవరపేట, ఎర్రకోనేరు, కొలిమేరు, మరువాడ, తాళ్లూరు పరిధిలో విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### న్యాయవాదుల బైక్ ర్యాలీ

ప్రత్తిపాడు: దేశం కోసం మధ్యవర్తిత్వం వారోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్తిపాడులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు వద్ద న్యాయమూర్తి ఎల్.గోపీనాథ్ ర్యాలీని ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు జంక్షన్, మెయిన్ రోడ్డు, అటవీశాఖ చెక్‌పోస్టు, జాతీయ రహదారి, పుత్ర చెరువు జంక్షన్, ఫైర్ స్టేషన్, మార్కెట్ సెంటర్ మీదుగా ర్యాలీ తిరిగి కోర్టుకు చేరుకుంది. రాజీ మార్గమే రాజమార్గం, సత్వర న్యాయం కోసమే మధ్యవర్తిత్వం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి గోపీనాథ్ మాట్లాడుతూ గత వారం రోజులుగా మధ్యవర్తిత్వంపై ప్రజల్లో అవగాహన కల్పించామన్నారు. తగాదాలను మధ్యవర్తిత్వం ద్వారా సానుకూలంగా, సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, ఐలాజ్ రాష్ట్ర కార్యదర్శి బుగత శివ, ప్యానెల్ అడ్వకేట్లు ఎస్ దేవి, ఏకేఎస్ మల్లేశ్వరరావు, బొంగుకూరి మధుబాబు, ఆదారి సుగుణ, సీనియర్ న్యాయవాది కొల్లా వీర్రాజు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో బైక్ ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

శంఖవరం: నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో కలసి పని చేస్తానని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ఐదేళ్లు పార్టీ తనకు జిల్లా అధ్యక్ష పదవి అప్పగించడంతో నియోజకవర్గంలో సమస్యలపై దృష్టి పెట్టలేకపోయానన్నారు. ఇకపై ఎమ్మెల్యేతో కలసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో పడాల నానాజీ, నక్క కృష్ణమూర్తి, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో బుధవారం ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి సూచనల మేరకు 2014 నుంచి ఏటా జూలై 16న నైపుణ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యువత సాధికారత, డిజిటల్ ప్రపంచంలో ఉద్యోగాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. యువత నైపుణ్యాలు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్స్ ఎస్.రమాశ్రీ, ఆదిరెడ్డి రమేష్, గ్రంథాలయాధికారి కె.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిని మించి ఎండలు

- ఉగ్రరూపం దాల్చుతున్న భానుడు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తొండంగి: ఎండలు మండిపోతున్నాయి. నైరుతి రుతుపవనాల ఆగమనం తర్వాత కూడా మండు వేసవిని మించి భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. రోహిణి కార్తిలో కాసే ఎండలు జూలైలో ఉండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గతకొద్ది రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉండగా బుధవారం ఎండ తీవ్రత మరింత పెరిగింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10 గంటల నుంచే రోడ్లన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. కొన్నిచోట్ల రహదారులపై వేడికి భారీ వాహనాల టైర్లు కూడా పేలుతున్నాయి. ఇటీవల ఎండ తీవ్రతకు గోపాలపట్నంలో టిప్పర్ లారీ టైరు పేలడంతో భారీ శబ్దం వెలువడింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జూలైలు ఎండలు మండిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు వర్షాల కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు.



నిర్మానుష్యంగా మారిన తొండంగి-గోపాలపట్నం ప్రధాన రహదారి

### బీఎల్‌ఓలకు శిక్షణ

శంఖవరం: ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు మండలంలోని బీఎల్‌ఓలకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 49 మంది బీఎల్‌ఓలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పోలింగ్ బూత్‌ల్లో ఉండాల్సిన మౌలిక సదుపాయాలు, విద్యుత్ సరఫరా, ఎన్నికల నిబంధనలు తదితర అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎల్ఎంటీ, ఏఎస్‌వో ఆసగర్ ఆలీ, పీఎంటీ ప్రసాద్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ డీవీ సాయి వర్మ, తహసీల్దార్ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

### మండల వ్యవసాయశాఖాధికారిగా పద్మశ్రీ



తొండంగి: మండల వ్యవసాయశాఖాధికారిగా ఎంఎంవీఎస్ పద్మశ్రీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఏఓగా ఉన్న ఎస్.నరసింహం కొన్ని రోజుల క్రితం జగ్గంపేటకు బదిలీ కాగా ఆయన స్థానంలో సామర్లకోట భూ పరీక్ష కేంద్రం నుంచి పద్మశ్రీ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఏఓగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు ఏఈవో మాధన సతీష్‌వర్మ, గ్రామ సచివాలయాల అగ్రికల్చర్ అసిస్టెంట్లు అభినందనలు తెలిపారు.